


# పాత గోడ

పిలుపుతో మేల్కొని అదిరిపడ్డాడు నారాయణ. వర్షం ఇంకా కురుస్తున్నట్లుంది. ఇంటి కప్పు మీద వర్షపు శబ్దం కొంచెం తగ్గినట్లుంది. కిటికీ లోంచి మసక మసకగా వెలుగు కనిపిస్తూంది—తెల్లవారు తున్నట్టుంది. ఆ స్థితిని పూర్తిగా అవగాహన చేసుకోక ముందే, మళ్ళీ తలుపు బాదిన శబ్దం, పిలుపూ వినవచ్చాయి.

"ఇంకా పూర్తిగా తెల్లార సన్నలేదు. ఎవలొచ్చిం(డుగావొచ్చు?" అని గునుస్తూ వెళ్ళి తలుపు తీశాడు నారాయణ జివ్వున తగిలింది చల్ల గాలి, బయట రేకులమీద చినుకులు వాయిద్యం లాగా శబ్దిస్తున్నాయి. అరుగు మీద రేకుల క్రింద నిలబడ్డ మనిషి తల రుమాలు గుడ్డ గట్టిగా పిండు కుంటున్నాడు.

"నేన్ మల్లయ్యను. రాత్రి బడ్డ ఆనకు గడిగోడ బగ్గనాని ఇటు మా గుడిశెల మీదికి ఒరిగింది. అది ఆయింత గుడిశెల మీద గూత్రె, గుడిశెలు గూలి గుడిశెలోల్లంత గూడులేనోల్లయితరు అందుకని తెల్లా రక్కుందె గోడను గడిలకే పడేటట్టు చెయ్యాలె. గడి గోడకు దొర బంగ్లకు శాన దూరం. ఆందుకని గోడ గడిలకు పడేశినా ఏం కాదు.

మా పెద్దోళ్లంత తాల్లు గడ్డ పారల్గిన పటోక్కని పొయ్యిండ్రు. ఊల్లోల్లను కొందర్ని సాయానికి పిల్సుక రమ్మంటే నేను పిల్సుకపోతాన. నువ్ నడువ్ తొందర్గ...''

''అట్లనా అయితె ఒస్త నడువ్'' మల్లయ్య మాటల్లోని ఆర్ద్రతకు చలించి అనాలోచితంగా అన్నాడు నారాయణ.

''తొందర్గ నడ్వు మల్ల తెల్లారి దొరకు తెల్వక ముందే అయిపో వాలె–నే నింకొందర్ని పిల్సుకొనొత్త......నువ్ పోతుండు గోడకాడికి'' మరో సారి చెప్పి కండువా నెత్తిన వేసుకుని వర్షంలోకి చొచ్చుకు పొయ్యాడు మల్లయ్య.

వస్తాను పద అన్నాడేగాని నారాయణకు భయం వేసింది, వెళ్ళ డానికి. ఆ గోడ వర్షానికి తడిసి కూలిందే అయినా, గుడిసెల వాళ్ళే కావాలని కూలగొట్టారని పగ సాధించ గలడు దొర. ఒక వేళ అది గుడిసెల పైనే కూలినా, వాళ్ళకు ఏదైనా సహాయం చేసేటంతటి దొడ్డ గుణం లేదు అతని దగ్గర. 'అదంతా మీ ఖర్మరా' అంటాడు.

గడిగోడ చాలా ఎత్తైంది. అది ఎప్పుడో చాలా ఏళ్ళ క్రితం దొరవారి తాతగారి తాత కట్టించారుట. ఆ కాలంలో ఆ గోడకు కావలి సిన మట్టిని ఏనుగులతో తొక్కించారని చెప్పుకుంటారు. అప్పట్లో వారు జమీందారులట...

దొరవారి బంగళా వారి తాతగారు కట్టించారట! దొర వారి పొలాలు, భావులు వారి తండ్రిగారు నిలబెట్టారు. చివరి దశలో వారిని రజాకార్లు నిలబెట్టారు. నిలబెట్టి తుపాకీతో కాల్చేశారు......ఇప్పటి ఈ దొరగారు దొరతనం వెలగ బెట్టడానికి గత చరిత్రే ముఖ్యకారణం. తప్పిస్తే, ఇప్పటి గొప్పతన మేమీ లేదు. చిన్నప్పుడు గారాబంగా పెరి

గారు కాబట్టి, చదువు అంతగా వొంటబట్టలేదు. జీవితంలో వారు తమ స్వంత చమట బొట్టును చూసి వుండరు. కనుక దబ్బపండులా, కొత్త దిండులా ఉంటారు.

వారసత్వం ప్రకారం వచ్చిన భూములు పండి పోస్తున్నాయి కనక, మీసాలు మెలేస్తూ రచ్చబండ మీద కూర్చుంటారు. పులిలా గాండ్రించ గలరు కనక—ఎదురు మాట్లాడిన వాడి నోటి బుక్క లాక్కోగల ధురీణుడు అని అందరికీ తెలుసు గనక ఊళ్ళో అందరు భయపడుతారు. దణ్ణం పెడతారు. అందరూ తనతెలివికి, దర్పానికి, వణుకుతున్నారను కుంటాడు దొర. అతని మూర్ఖత్వాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని అతనికి తెలియదు.

నారాయణ లోన వరడాలోకి చూశాడు—దీపం చిన్నగా వెలుగుతుంది. సుజాత ఇద్దరు చిన్న పిల్లల్ని అదుముకుని చాపమీద పడుకుంది.

"నాలుగు డబ్బులు కూడాక, ఈ ఊళ్ళోంచి వెళ్ళిపోయి పట్నంలో దుకాణం పెట్టుకుందాం. ఇక్కడుంటే గ్రామ దేవతలకు ఉద్దెర ఇవ్వటంలోనే మన బతుకులు నాశన మౌతాయి" అంటుంది సుజాత. కాని డబ్బులు కూడేదెప్పుడూ?

మరోవైపు చిన్న మంచం మీద సుదర్శనం ముడుచుకు పడుకున్నాడు.

'వాడు మంచి తెలివిగల వాడు. ఉత్సాహం వుంది. వాడికి తగిన చదువు చెప్పించగలనో లేదో? మరో రెండేళ్ళలో చదువుకు కాలేజీకి పంపాలి. దుకాణం మీద వచ్చే లాభం రోజు ఖర్చుకు మాత్రమే సరిపోతుంది. ఎలాగవుతుందో ముందు ముందు?'

అక్కడి నుండి కదిలి వచ్చి, బల్లపీట మీద తన పాత పరుపులో పడుకున్నాడు. కాని నిదరొచ్చే సూచన లేవీ కనిపించటం లేదు. వర్షం శబ్దం వినవస్తూనే వుంది. గోడదగ్గరికి వెళదామని అనిపించినా ఏదో భయం కలిగింది. దొరకు తెలిస్తే ఏమైనా అంటాడేమో? అసలే కోపంగా ఉన్నాడేమో నిన్న సాయంత్రం నుండి...

రాత్రి బాగా పొద్దు పోయిన తరువాత ఇల్లు చేరగానే, దొర పిలిచారని చెప్పింది సుజాత. అప్పుడే వెళ్ళి కలిసి వద్దామని పించింది. రాత్రి పది దాటింది. చిన్న వర్షం కూడా మొదలయింది. తీరావెళ్ళినా కష్టపడి వచ్చాడన్న అదరణా ఉండదు. 'ఏం రా కోమటోడ! గప్పుడు పిలిస్తే గీ అద్దరాత్రొచ్చినావ్'-అంటూ ఇష్టం వచ్చినట్టు తిట్టగలడా మహానుభావుడు. ఇలా లోగడ జరిగింది కూడా. అందుకే ఆ అనుభవం జ్ఞాపకానికొచ్చి, ఆ తిట్లేవో రేపు పడవచ్చులే అనుకుని వెళ్ళే ప్రయత్నం మానుకున్నాడు నారాయణ

దొర ఏ వేళప్పుడు పిలిచాడు. ఎందుకు పిలిచాడు తెలుసుకుందామని భార్య నడిగాడు. సుజాత చెప్పింది. సాయంత్రం అయిదు గంటలకు ఏదో లెక్కలు చెయ్యడానికి, కలం కాగితం పట్టుకుని రమ్మని మనిషిని తోలాడుట దొర. ఆ మనిషితో తనింట్లో లేని విశయం చెప్పిందట సుజాత. ఆ మనిషి వెళ్ళిపోయి కొంచం సేపటికి తిరిగి వచ్చి, దొర కలంకాగితం ఇమ్మన్నాడని అడిగాడుట. కాగితం ఇచ్చి 'కలం దొరకటం లేదు. ఎక్కడైనా పెట్టి వెళ్ళాడో లేక వెంటగాని తీసుకు పోయాడో' నని చెప్పిందట-తనభార్య. కాగితం తీసుకుని వెళ్ళిపోయాడు వచ్చినతడు. దుకాణానికి వచ్చిన వారికి సామాన్లిస్తూ తీరిక లేకుండా వున్న సుజాత దగ్గరికి మళ్ళీ దొర పంపిన మనిషి వచ్చి "సావుకార్రాంగనే నట దొర్రమ్మని సెప్పిండని సెప్పు. సావు

కార్ను దొర బాగ దిడ్తాండు, ఏందో్కగని..."- అని చెప్పి వెళ్ళి పోయాడుట.

'ఈ గడీకి, దొరోళ్ళకు దగ్గరగా వుంటే ఏదో ఇలాగే చేస్తూం టారు. దూరంగా ఊరి బయటికి పోదాం' అనంటుంది సుజాత. వూరి మధ్య నుంచేనే మంచి గిరాకి వూరి బయటుంటే దుకాణం సరిగా నడవదని దానికి తెలియదు.

కాని, దొర ఎందుకు తిట్టాడో ఏమో? అర్థం లేకుండా, కారణం లేకుండా. చిన్న చిన్న లెక్కలు కూడా చేసుకో లేడు. అన్నీ భయపడుతూ చేసి పెట్టాలి. సుదర్శన్ లేచి దీపం దగ్గరగా పెట్టుకుని ఏదో చదువు కుంటున్నాడు. వీడు- సుదర్శన్ కూడా అంతే. దొర కొడుకు రమేష్‌రెడ్డి లెక్కలు కూడా వీడే చేసి పెట్టాలి. కాని అంత లోనే చిన్నగా నవ్వొచ్చింది, నారాయణకు. వీడికీ, తనకూ చాలా భేదం వుంది. దొర పిలిచాడంటే భయపడుతూ వెళతాడు తను. కాని దొర కొడుకే రోజూ వీడి దగ్గరి కొస్తాడు. కొడుకు గురించి ఏదో గర్వంగా తోచింది నారాయణకు. బయట వర్షం పూర్తిగా తగ్గినట్టుంది.

* * *

గడి గోడ కూలిందని తెలిసినప్పటి నుండి దొర వారికి చాలా బాధగా ఉంది రోజూ ఉదయం టీ త్రాగాక పొలం దగ్గరిదాకా వెళ్ళొచ్చేవారు కాని, ఈ వేళ వెళ్ళాలనిపించటం లేదు.

వాకిట్లోకి వచ్చి చూశాడు. గడిగోడ పూర్తిగా కూలే ఉంది. మట్టిబెడ్డలు వాకిట్లో దాకా చిమ్మాయి. గోడ అవతలి గుడిసెలు కని పిస్తున్నాయి. ఆ వెధవలకు తనకు మధ్య అడ్డులేకుండా పొయెనే అని అతని మనసు చివుక్కుమంది. తన అధికారమేదో పడిపోయినట్లు ఆవేశం కలుగుతూంది. అందుకే ఊరి మధ్యనుండి తల ఎత్తుకుని

పొలం దాకా వెళ్ళలేననిపించి మానుకున్నారు. సమయం ఉదయం తొమ్మిదై పోయింది.

గడి ముఖద్వారం దాటి, రచ్చబండ దాకా వచ్చారు దొరవారు. రాత్రి వానకు తడిసి అక్కడక్కడా నీళ్ళు నిలిచి కూర్చో రాకుండా వుంది. అది మరీ అవమానంనా తోచింది. అక్కడ నిలుచుండి చూస్తే ఇటు గుడిసెలు, మధ్యన కూలిన గోడ, కొంత దూరంలో తన బంగళా కనిపిస్తున్నాయి. తను చేస్తున్న ఎన్నో పనుల్ని ఈ గోడ లోకానికి కనిపించకుండా చేసేది. అదే ఇప్పుడు కూలి పోయింది. ఇప్పుడెలా? గత చరిత్ర అంతా కూలిపోయినట్టు దొరవారి మనసులో మనసు లేదు.

"నమస్కారం, దొరా!"-వినయంగా అన్నాడు నారాయణ.

నిన్నటి విశయమంతా జ్ఞాపకాని కొచ్చి, దొరవారు భగ్గు మన్నారు

"ఏంరా! కణ్లు నెత్తికెక్కినయ్ నీకు. పిల్వంగనె రావులే. కలం పంపమంటె నీపెణ్లాం పంపదులే. కండ పెర్గి పోతాంది. పెద్ద శిన్న ఏడ గన్పడ్తరునీకు"

"లేద్దొర. కలం నాతాన్నే ఉండె. నేనేమో మొన్నూరికి బోయి రాత్రొచ్చిన."

"పోవుర-మరి పోతవ్. నీక్ తక్కువేంది.? ఈ వూళ్లెమందిని ముంచి ఏరే ఊల్లల్ల బిజినెస్ జేస్తవుర నువ్వూ. నీకత లెవన్కి-తెల్వాయి బొక్క లిర్గదంత గాడిది కొడ్కా- ఎదురు మాటాడ్తవ్ ఇంక"

తన మాటల్లో కఠినత్వం కరిగి పోయింది, ఠీవి చెరిగి పోయిం దని అనిపించింది దొరవారికి. ఇదే నిన్నటి రోజయితే చెప్పు తీసుకున్

కొట్టేవాడు. అంతటి పౌరుషం, ఆవేశం ఏమయింది అయ్యో! తిట్టనైనా రావడం లేదేనని తన బలహీనతను తలచుకుని కుమిలిపోతున్నాడు దొరవారు.

అనవసరంగా ఇతరులను ఇలా తిడతావు గనకనే నాశనమైపోతున్నావ్. తండ్రి తాతలకున్న పేరు, ధర్మబుద్ధి నీకు లేదు కనకనే రోజు రోజుకు నీచుడి వవుతున్నావు. ఇద్దరు బిడ్డల పెళ్ళిళ్ళు చేసేందుకు సగం భూమి అమ్ముకున్నావేమో-ఇంక మిగిలిన ముగ్గురివి చేసే సరికి చేతికి చిప్ప వస్తుంది. ఇక పట్నం వెళ్ళి రేసులకు తాగుడుకు అలవాటయి నావేమో ఇక నీకు మూడినట్టే-అనుకున్నాడు నారాయణ.

"ఫోర ఫో గిడేం నిలబడ్డవ్! నీ పని చూస్తఫో"-గద్దించాడు దొర.

నారాయణేమీ మాట్లాడ లేదు-నాపనేం చూస్తా డీయన? అంతగా అయితే ఇవ్వవలసిన రూపాయలు ఎగ్గొడతాడేమో?

రోజూ దొరవారు పొలం వైపు వెళుతూ నారాయణ ఇంటిముందుకు రాగానే 'నారాయణా' అని పిలుస్తూ పోతుండేవారు, ఆగకుండా-దొర వారు గదా మరి! 'అయ్యా' అంటూ నారాయణ వెనకే పరిగెత్తే వాడు. ఫలాని సామాను యింట్లో ఇచ్చిరా అనో, సిగరెట్ డబ్బా, అగ్గిపెట్టె తెమ్మనో చెప్పేవారు. సిగరెట్ డబ్బా అగ్గిపెట్టె తెమ్మంటే దుకాణం దాకా పరిగెత్తుకొచ్చి అవి తీసుకుని మళ్ళీ దొర వెళ్ళినంత దూరం పరిగెత్తి వెళ్ళి ఇచ్చి వచ్చేవాడు. ఒక్కోసారి దొర వెనకాలే దాదాపు పొలం దాకాపరిగెత్త వలసి వచ్చేది. తను ఏ హీన స్థితిలో ఉన్నాడో ఆలోచించు కుంటే అసహ్యం వేసేది నారాయణకు.

గుండె నిండా అగ్గిని నింపుకుని కూడా తనంతట అది వెలగలేని అగ్గిపెట్టెలా తిరగబడాలన్న కోర్కె వుండి కూడా తోడులేక అయిష్టంతో అసహాయతను నటిస్తున్నాడు నారాయణ.

బీద వాళ్ళ రెక్కల కష్టాన్ని, వాళ్ళ నూటిని పీల్చేస్తున్నట్లు విలాసంగా సిగరెట్ పీల్చి, వాళ్ళకు సరైన గాలి మాత్రం ఎందుకు అందాలనేమో విషపు పొగగాలి రింగులు రింగులుగా వదులుతారు దొరగారు.

డబ్బులడిగితే గద్దించేవాడు. 'రాసి పెట్కో ఇస్త తీయర'-అనేవాడు. ఖాతా బిల్లు నాలుగువందల దాకా కావొచ్చు. దొక కావొచ్చు. అంతకు ముందొక సారి నూట యాభై ఇవ్వవలసి వుంటే, ఏభై యిచ్చి సరిపెట్టుకో అన్నాడు. ఇట్లా ఎందుకూ? అని ఎదురు మాట్లాడ కూడదు. ఎంతైనా దొరవారు గదా మరి? ఇలాగయితే ఈ చిన్న దుకాణాలు ఎలా నడవాలనుకుంటాడో, ఏమో?-ఇంకా పని చూసేదేమిటి? అవే ఎగవేస్తాడేమో? అనుమానం కలిగింది నారాయణకు. పిల్లలకు-బడికి వెళ్ళే సమయమైంది. గుంపులు గుంపులుగా పోతున్నారు. కొందరు పిల్లలు అంతెత్తు గోడ ఎలా కూలిందోనని ఆశ్చర్యపోతున్నారు. నారాయణ కొడుకు సుదర్శన్ కూలిన గోడ మట్టిపై నిలబడి "రమేశ్ రెడ్డి-అరేయ్ రమేశ్!"-అని దొర బంగళా వైపు కేకేశాడు.

ఇదంతా చూస్తున్న దొరవారికి అవమాన మనిపించింది. ఎదురుగా నిలబడి ఉన్న నారాయణే తన నలా పిలుస్తున్నట్లని పించింది. మూర్ఖత్వం, క్రోధం, మేల్కొన్నాయి.

"ఇంక నిలబడ్డ వేందిర కుక్కల కొడ్కా? పో బే!"-చెప్పు విడిచి వంగాడు. కాని చెప్పును చేతిలోకి తీసుకోలేక, ప్రయత్నం మానుకుని నిలబడ్డా డు. నారాయణకు కొడుకును, కూలిన గోడను

చూస్తే ఎంతో ధైర్యం కలిగింది. ఈ కుప్పిగంతులేం చెయ్యలేవు. రావలసిన డబ్బు ఇకనుంచి సరిగా వసూలు చేసుకో గల నన్న నమ్మకం తనమీద తనకు కలిగింది. "మంచిగ మట్లాడుడు నేర్సుకుంటె మంచి గుంటది''—అని నారాయణ చరచరా వెళ్ళిపొయ్యాడు. దొర వారికి గొప్ప పరాభవం కలిగిందనిపించింది. లోన ఆవేశం ఒళ్ళు పెంచు కుంటూది. కాని, కూలిన గడి గోడ నిరాశను కలిగిస్తూంది.

గడి చుట్టూ తిరిగి ముఖద్వారం నుండి గడీలోకి ప్రవేశించే జన మంతా కూలిన గోడమీది నుండి పోవడం కనిపించింది.

చాకలాళ్ళు, ఇంటి పనిమనుషులు, జీతగాళ్ళు అడుక్కునే బిచ్చ గాళ్ళు - అందరూ ఆ కూలిన గోడ మీది నుండే బాట పడేశారు.

ఆ గడిగోడ మట్టిలో తరతారాల్నించి వస్తున్న దొరతనం, అధి కారం ఉన్నాయి. ఈనాడు వాటిని అణగ దొక్కుతూ నడుస్తున్న మను షుల్ని చూస్తే, వాళ్ళందర్నీ చంపేయాలనిపిస్తుంది. కాని ఏమీ చేయలేని అసహాయిత.

స్కూలు వైపు మరో పిల్లల గుంపు వెళుతూంది. నమస్కార మంటూ ఎత్తిన ఆ పిల్లల చేతులు తనను పడగొట్టడానికే అన్నట్లని పిస్తోంది. రాత్రి కురిసిన వర్షానికి, భూమంతా నాని ఉంది. పొలాలు దున్నడానికి గుడిసెల వాళ్ళు నాగళ్ళు కట్టారు. గుడిసెల వైపు పడిన మట్టి బెడ్డల మీది నుండి, గడిగోడ మన్ను దున్నుతూ వస్తున్నాయి. తన గుండెను దున్నడానికొస్తున్నట్లు అనిపించింది దొరవారికి. వణుకు మొదలైంది.

రచ్చబండపై దొరలా కూర్చోలేకపోయినా దాని దగ్గరే అతి

సామాన్యుడిలా కూడా నిలబడలేక ఎవరో తరుముతున్నట్లు, ఏదో విరిగి మీద పడుతున్నట్లు, ఏదో ఎదురు తిరిగినట్లు, భయం భయంగా బ్రతికితే చాలన్నట్లుగా 'దొరవారు' ఇంటివైపు అడుగు లేశారు.

ఎన్నడూ చూడని పిల్లలకు, గడిలోని మట్టి ఇవతలి మట్టి ఒకే రీతిగా ఉన్నందుకు ఆశ్చర్యం కలిగింది. వాళ్ళకేం సంతోషమో అటూ, ఇటూ మట్టితో కలిసి దారిలోకి దొర్లిన కొన్ని పునాది రాళ్ళను బల వంతంగా లేపి గడిలోకి, గడివెలుపలకు రెండు వైపులా సమానంగా వేస్తున్నారు.

సమానత్వానికి సంకేతంగా కాబోలు దూరం నుండి బడి గంట వినిపిస్తూంది.

ఆంధ్రప్రభ
సంక్రాంతి ప్రత్యేక సంచిక
16-1-1974